1

# దేవుడు, మానవాళి, మరియు పాపము

## (ఆదికాండము 1-3)

పరిశుద్ధ గ్రంథమును అర్థంచేసికొనుటకు ఆదికాండములోని మొదటి మూడు అధ్యాయములు సహాయం చేస్తాయి. "ఆదికాండము" ("Genesis") అంటే "ఆరంభము" అని అర్థము. సృజించబడిన విశ్వం, జీవితం, పాపం, మరణం వంటి వాటి ఆరంభమును మూలాలను ఆదికాండం తెలియజేస్తుంది. లేఖనములను అర్థం చేసికొనుటకు ఈ జ్ఞానం కనీస అవసరం ఎందుకంటే ప్రతి లేఖనము కూడా ఆదికాండము తరువాతనే వ్రాయబడింది. కాబట్టి ఆదికాండము 1-3 నిజముగా ఒక ముఖ్య లేఖనము.

### దేవుడు

"పరిశుద్ధ గ్రంథం దేనిని గురించి చెబుతుంది?" అని ఎవరైనా మనలను అడిగితే మనం ఒకే ఒక్క మాటలో చెప్పవచ్చు: "దేవుని గురించి." ఆదికాండము మొదటి అధ్యాయంనుండి ప్రకటన గ్రంథం ఆఖరి అధ్యాయంవరకు అంతా దేవుని గురించే చెప్పబడింది. అంతేగాకుండా, పరిశుద్ధ గ్రంథంలో మానవాళి గురించి, వారు పాపంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మరియు అవసరమగు విమోచన గురించికూడ ఇందులో చెప్పబడింది. అయితే ఇందులో కేంద్రం మాత్రం మానవుడు కాదు - దేవుడే.

"ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆదికాండము 1:1). దేవుని యొక్క ఉనికిని గురించి ప్రశ్నించకుండా లేదా దీని గురించిన చర్చతో గాక, దేవుని ఉనికిని గూర్చిన నిర్ధారణతోనే పరిశుద్ధ గ్రంథం ఆరంభమవుతుంది. ఎందుకిలా? దేవుని ఉనికి సత్యసిద్ధమైనది. ఒకవేళ సృష్టిచేయబడిందంటే దాని వెనుక సృష్టికర్త ఉన్నట్లే. చక్కగా అందముగా ముద్రించబడియున్న ఈ గ్రంథమును చూసినప్పుడు ఇది ముద్రణా వారి యొక్క పనితనమని, బైండింగ్ వారి నైపుణ్యమని మనం భావించము, గాని ఒకటి లేదా అంతకంటే ఎక్కువమంది గ్రంథకర్తలు దీనిని వ్రాసి, కూర్పు చేశారని, దీనిని ఆఖరకు ఒక గ్రంథ రూపంలోకి తెచ్చారని మనం భావిస్తాము. ఇదే సహేతుకమైన ముగింపు. ఈ సృష్టిని, ఇందులోని విశేషాలను చూచి మరొకరెవరో దీన్ని సృజించారనడం కంటే సహేతుకమైనది మరొకటి లేదు.

"ఒకవేళ దేవుడే లేకపోతే మన కళ్ళ ఎదుటనున్నదంతయు ఎక్కడినుండి వచ్చింది?" అని హేతువాదులను ప్రశ్నించితే వారినుండి సరియైన సమాధానం రాదు. ఇది వాయువుల మిశ్రణము మరియు ఆరంభంలోని విస్ఫోటనాలవలన అని వాటిని గురించి చెప్పుటకు పూనుకొనుటవలన ప్రయోజనం లేదు. ఎందుకంటే, ఈ సంఘటనలు సంభవించుటకు అవసరమగు "ముడి పదార్థముల" ఉనికిని గురించే వారు వివరించలేరు. ఏదియు లేకుండా ఏదీ రాదు గనుక మనచుట్టునున్న ప్రతిదానికి "తొలి కారణం" అంటూ ఒకటి ఉండి తీరాల్సిందే.

దేవుడు ఉన్నాడన్న సత్యాన్ని బుద్ధిహీనులు త్రోసిపుచ్చుతారని కీర్తనలు 14:1 తెలియజేస్తుంది. ఆదికాండము గ్రంథమును బుద్ధిహీనులు ఎలాగు వినలేరు కాబట్టి పరిశుద్ధ గ్రంథం వారితో వాగ్వాదానికి దిగుటలేదు లేదా దేవుని ఉనికిని "నిరూపించడానికి" ప్రయత్నించుటలేదు.

సృష్టిని గురించి, విశ్వం ఆరంభమును గురించి ప్రాచీన మానవుల అభిప్రాయములకు భిన్నముగా ఆదికాండము 1:1 స్పష్టముగా మాట్లాడుతుంది. ఈ విశ్వమును సృష్టించుటకు ఎంతో మంది "దేవుళ్ళు" ఎన్నో రకాలుగా ప్రయాసపడ్డారని ఆదిమ మానవులు భావించేవారు. కొంతమంది దేవుళ్ళ మధ్య జరిగిన పోరాటం ఫలితంగానే ఒక పదార్థం ఏర్పడిందని, ఈ రోజున మనం నివసించే భూమి అదేనని వారు భావించారు.

అయితే ఇందుకు భిన్నముగా, దేవుడు ఒక్కడేనని, ఆయన ఒక్కడే ఈ భూమిని, సమస్తమును నిర్మించాడని ఆదికాండము స్పష్టంచేస్తుంది. సృష్టియంతటికి మూలకారకుడిగా దేవున్ని ఆదికాండము 1 మరియు 2 అధ్యాయాలు ఎలా చూపిస్తున్నాయో గమనించండి. ఉదాహరణకు, జీవ పదార్థము, మొక్కల సృష్టి గురించి 1:1–19 వివరిస్తుంది. అలాగే 1:20–25లో జీవరాశుల సృష్టి గురించి మనం చూస్తున్నాము. చివరిగా, మానవుని సృజించుటతో సృష్టిగాథ ముగించబడింది (1:26–30; 2:4–25). తద్వారా ఇందులోని సందేశం స్పష్టమవుతుంది: దేవుని నుండి వేరుగా *ఏదియూ లేదు!*

అలాగే దేవుని స్వభావం, గుణగణాలు సృష్టి గాథలో వ్యక్తం చేయబడ్డాయి. ఈ వ్యాఖ్యాన లక్షణాలు ఈ అధ్యాయాలలో పేర్కొనబడలేదుగాని వివరించబడ్డాయి; ఆయన ఏం చేశాడన్న విషయం ద్వారా దేవుని స్వభావం *వ్యక్తం చేయబడింది.* ఒక వ్యక్తి చేసే పనుల ద్వారా అతని స్వభావం స్పష్టం అవుతుందని తరువాత వాక్యంలో యేసు చెప్పారు (మత్తయి 7:15–20). ఇది దేవుని విషయంలోనూ సత్యమే.

## శక్తి

ఉదాహరణకు, సృష్టి గాథ నుండి మనం దేవుని *శక్తిని* గురించి నేర్చుకోవచ్చు. కేవలం తన "మాట" ద్వారానే సమస్తమును సృజింపగల సమర్థుడాయన. మనవలెగాక, దేవుని మాటలు ఎంతో శక్తి కలిగినవి. ఆయన ఏదైనా అంటే అది జరిగి తీరుతుంది. కీర్తన 33:6 ఈ సత్యాన్ని బలపరుస్తుంది; "యెహోవా వాక్కు చేత ఆకాశములు కలిగెను. ఆయన నోటి శ్వాసచేత వాటి సర్వసమూహము కలిగెను" అదేవిధంగా ఈ విషయాన్నే యెషయా 55:10, 11 వాక్య భాగం తెలియజేస్తుంది,

> వర్షమును హిమమును ఆకాశమునుండి వచ్చి అక్కడికి
> ఏలాగు మరలక
> భూమిని తడిపి విత్తువానికి విత్తనమును
> భుజించువానికి ఆహారమును కలుగుటకై అది చిగిర్చి
> వర్ధిల్లునట్లు చేయునో
> ఆలాగే నా నోటనుండి వచ్చు వచనము ఉండును
> నిష్ఫలముగా నాయొద్దకు మరలక
> అది నాకు అనుకూలమైనదాని నెరవేర్చును
> నేను పంపిన కార్యమును సఫలముచేయును.

దేవుని గురించిన ఈ సత్యమును ఎరిగినట్టయితే, దేవుడు మాట్లాడునప్పుడు మనం తప్పనిసరిగా వినాలి.

**జ్ఞానము**

ఆదికాండము 1-3 అధ్యాయములనుండి మనం దేవుని యొక్క జ్ఞానమును కూడా చూడగలము. 1వ అధ్యాయమును నిశితముగా పరిశీలిస్తే, ఈ సృష్టి ఎంత జాగ్రత్తగా, క్రమముగా చేయబడిందో అవగతమవుతుంది. క్రమము లేకుండాయున్న దానిని దేవుడు ఏ విధంగా క్రమపరిచాడో ఆదికాండము 1:2 తెలియజేస్తుంది. తరువాత ఆయన నిర్జీవ పదార్థమును, మొక్కలు, జీవరాశులు, ఆఖరికి మానవులను సృజించాడు. ఈ సృష్టి అనుకోని పరిస్థితుల్లో ఒక్కసారిగా జరిగిపోలేదు గాని, నిర్మాణాత్మకంగా, క్రమముగాను జరిగింది. మనముందున్న ఈ లోక నిర్మాణం, దీని నిర్మాణకుని అత్యద్భుత తెలివి, మేధస్సును చూపిస్తుంది. కాబట్టి, ఈ సృష్టి నిర్మాణం ఆకస్మికంగా జరిగిందనడం కేవలం బుద్ధిహీనతే.

చాలా సంవత్సరాల క్రితం నేను టెక్సాస్‌లో ఉన్నప్పుడును మోనార్క్ సీతాకోక చిలుకలు ఆ ఊరి మీదుగా ఏడాదికొకసారి మెక్సికోలోని ఒక ప్రాంతమునకు వెళ్ళే సన్నివేశాన్ని నేను చూడగలిగాను. ఆ మోనార్క్ సీతాకోక చిలుకలు ఎక్కడో ఉత్తర అమెరికానుండి బయలుదేరి గుంపులు గుంపులుగా కూడి మెక్సికోలోని కొన్ని ఎకరాల నిర్దిష్ట ప్రాంతానికి వలస వెళ్తాయి. దీని వెనుక ఉన్న రహస్యం ఏమిటో ఇప్పటివరకు ఎవరూ చెప్పలేకపోయారు (ఎంతో మంది ప్రయత్నించి విఫలమయ్యారు), అనేక లక్షల సీతాకోక చిలుకలు ఎటునుంచి బయలుదేరినా ఆఖరికి మెక్సికోలోని ఒక నిర్దిష్ట ప్రాంతంలోనే ఆగుతాయి. అసలు దేవుడే లేకపోతే వీటికంత సూక్ష్మబుద్ధి ఎలా కలిగింది అని ఒకరు ఆశ్చర్యపోవచ్చు. తాము బయలుదేరి వలసవెళ్ళుటకు ఇదే సమయమని సీతాకోకచిలుకలకు ఎలా తెలుస్తుంది? తాము ఇదే స్థలమునకు చేరుకోవాలని వాటికి ఎలా తెలుస్తుంది? బహుశ ఒక "ఆదిమ సీతాకోక చిలుక" బయలుదేరి వెళ్ళి మిగతావాటికి ఆ సమాచారమిచ్చిందని మనం భావించవచ్చా? అవి ఆకస్మికంగానే, అనుకోకుండానే ఆ స్థలానికి ప్రతి సంవత్సరం చేరుకుంటున్నాయా? ఈ అల్ప ప్రాణులను దేవుడు సృష్టించడమేగాకుండా ప్రతి సంవత్సరం యిలా పయనించాలన్న జ్ఞానమును వాటిలో ఎలా "ఉంచాడన్న విషయం" మన తార్కిక జ్ఞానమునకు అందనది. అటువంటి సృష్టికర్త యొక్క జ్ఞానము జ్ఞానమునకే అతీతమైనది.

**మంచితనము**

ఈ అధ్యాయములు దేవుని *మంచితనమును* కూడా తెలియజేస్తున్నాయి. "దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాలమంచిదిగనుండెను" అని 1వ అధ్యాయం చివరి భాగంలో చూస్తున్నాము (1:31ఎ). దేవుడు చేసిన ప్రతి కార్యములోను దేవుని మంచితనము అనే స్వభావం ప్రతిఫలిస్తుంది. మనకెంత గొప్ప వార్త ఇది! దేవుడు మంచివాడా లేక చెడ్డవాడా అని, ఆయన మనలను ప్రేమిస్తున్నారా లేక త్రోసివేస్తున్నాడా అని మనలను ఆయన దీవిస్తున్నాడా లేక అణగద్రొక్కుతున్నాడా అన్న విషయం గురించి మనం ఆశ్చర్యపడనక్కరలేదు.

పరిశుద్ధ గ్రంథం ఆరంభంనుండి, "శరీరధారియైన" దేవుని రూప చిత్రాన్ని మనం

చూడగలం. అదే దేవుడు ఈ లోకమును సృష్టించి, దాన్ని కాపాడుతూ, నడిపిస్తూ, దానిని ఆశీర్వదిస్తున్నాడని పరిశుద్ధ గ్రంథంలో మనం చూస్తున్నాము.

**మనుష్య జాతి**

ఆదికాండములో మనుష్య జాతి సృష్టి అనేది వేరే ఒక ప్రత్యేక అంశం కాదుగాని సృష్టికర్తయైన దేవునికి సంబంధించినదే! 1:26ఎలో మొట్టమొదటిగా మనుష్యుల ప్రస్తాపన ("నరులను" హెబ్రీలో *adam*) వచ్చింది. ఇది స్త్రీ పురుషులిద్దరికి సంబంధించినది. "మన స్వరూపమందు మన పోలికె చొప్పున నరులను చేయుదము" అని దేవుడు అన్నాడు.

మనుష్యులను గురించిన మొదటి ప్రస్తాపన ఆయన ఈ వచనంలో మానవుడు ఒక్కడే దేవుని "స్వరూపము చొప్పున" మరియు దేవుని "పోలికచొప్పున" నిర్మించబడ్డాడు. అలా అని మానవులు శరీరాకార ప్రకారముగా దేవునివలె ఉంటారని కాదు. మరయితే దీని అర్థం ఏమిటి? దేవుని "స్వరూపము" అంటే, దేవుని స్వభావం వలె తెలివి, సృజనాత్మకత, ప్రేమించేగుణం వంటి లక్షణాలు కలిగియుంటారని అర్థం. ఈనాటి జీవపరిణామ క్రమములో మానవుడు "ఉన్నతస్థాయి జంతువు" అన్న ఆధునిక సిద్ధాంతాలకు ఈ స్వభావం పూర్తి విరుద్ధం. (చింపాంజీలను కూడా మానవులతో సమానముగా *హోమో సెపియన్స్‌గా* వాటిని గుర్తించాలని ఒక పరిశోధకుడు ఈ మధ్యనే ప్రతిపాదించాడు.) మనము దేవుని స్వరూపములో సృజింపబడ్డామన్న మాటకు మరింత స్పష్టతను 26వ వచనం ఇస్తుంది: "వారు సముద్రపు చేపలను ఆకాశ పక్షులను పశువులను సమస్త భూమిని భూమిమీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురుగాక." దేవుని స్వరూపమందు చేయబడడం ద్వారా సహజంగానే మిగతా సృష్టి అయిన భూమి మొక్కలు, జీవరాశులు వంటి వాటిపై పరిపాలనాధికారం మానవునికి ఇయ్యబడింది. ఇదే విషయం 28 నుండి 30 వచనాల్లోను చెప్పబడింది. "భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి" అని స్త్రీ పురుషులిద్దరికి దేవుడు ఆజ్ఞను ఇచ్చాడు. సృష్టియంతటిమీద అధికార బాధ్యతను దేవుడు అప్పగించాడు. అలా అని దేవుని సృష్టిమీద మానవుడు సర్వాధికారికాదు గాని, దేవుని చేత నియమించబడిన అధికారి. ఈ సృష్టిమీద మనకు అధికారం, బాధ్యతలున్నాయి. దీన్ని మనం వాడుకోవాలేగాని, దుర్వినియోగం చేయకూడదు. దేవుని స్వరూపమందు సృజింపబడడం ద్వారా మానవులందరు మిగతా సృష్టికంటే విభిన్నులు; ఉన్నతులు. ఈ సత్యము ఇప్పుడు ప్రాచుర్యములోనున్న "ప్రకృతి దేవారాధనను" తీవ్రంగా ఖండిస్తుంది (రాళ్ళు, చెట్లును పూజించడం పురాతన కాలంలోనుండి ఉన్నది). భూమ్యాకాశములు మన "తల్లి" మరియు "తండ్రి" కారు. అవి కూడ దేవుని సృష్టిలో భాగమే. దేవుని పక్షముగా వాటిపై మనకు అధికారమున్నది.

మనుష్యులకున్న మరో "ప్రత్యేకతను" మనం ఆదికాండము 2వ అధ్యాయములో చూస్తున్నాం. తన సృష్టికర్తయైన దేవునితో మానవుడు ప్రత్యక్ష మరియు పరోక్ష సంబంధం కలిగియున్నాడు. "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (2:7). నరుని వలె సృష్టిలోనిదేదియు ఈ విధంగా నిర్మింపబడలేదు. కేవలం నోటి మాటచేతనే అవి ఉనికిలోకి తేబడ్డాయి. దేవుని జీవవాయువు నుండియే మనష్యుని ప్రాణం వచ్చింది.

అలాగే, దేవునితో గల సంబంధమును, అలాగే ఇతరులతో గల సంబంధమును

బట్టి మానవుడు సంతోషించాలని సృష్టిగాధ స్పష్టం చేస్తుంది. మిగతా సృష్టికి ఇటువంటి అవకాశం లేదు. స్త్రీ పురుషులిద్దరికీ దేవుడు ఆజ్ఞను ఇచ్చి కొన్ని హద్దులను వారికి నియమించాడన్న విషయం 2:7లోని సంబంధము యొక్క ప్రత్యేకతను తెలియజేస్తుంది. దేవునితో సత్సంబంధమును కలిగియుండాలంటే, ఆ సంబంధం యొక్క నియమములను మానవుడు ఎరిగియుండాలి. దైవమానవ సంబంధం గురించి పౌలు ఏథెన్సు పట్టణంలోని తన ప్రసంగంలో పేర్కొన్నాడు:

> జగత్తును అందలి సమస్తమును నిర్మించిన దేవుడు తానే ఆకాశమునకును భూమికిని ప్రభువైయున్నందున హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువయున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు. మరియు యావద్భూమిమీద కాపురముండుటకు ఆయన యొకనినుండి ప్రతి జాతిమనుష్యులను సృష్టించి, *వారు ఒకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని, తన్ను వెదకునిమిత్తము నిర్ణయకాలమును వారి నివాసస్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను* … (అపొస్తలుల కార్యములు 17:24-27; నొక్కి చెప్పింది నాది).

ఆదికాండములో చెప్పబడిన మాటలనే పౌలు బలపరుస్తున్నాడు. మన సృష్టికర్తతో సరయిన సంబంధమును కలిగియుండడానికే మనం సృష్టించబడ్డాము. ఆ సంబంధం ఏర్పరచబడే వరకు మన జీవితం సంపూర్ణం కాదు. ప్రాథమికంగా పరిశుద్ధ గ్రంథం బోధిస్తున్నది ఇదే!

తోటి వారిలో ఒకరికి ఒకరము సత్సంబంధం కలిగి యుండుటకు కూడ దేవుడు మనలను సృష్టించాడు. "నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదు" అని ఆదికాండము 2:18లో దేవుడు భావించాడు. ఆ నరునికి తోడు మాత్రమే అవసరం కాదుగాని "సాటియైన" సహాయం కావాలి. తనలాంటి స్వభావం కలిగి తన జీవితమును పంచుకునే తోడైయుండాలి. కాబట్టి దేవుడు అతని కొరకు "సహకారిని" నిర్మించాడు. (ఇక్కడ సహకారి అనే పదం విపరీతార్థానికి దారి తీయడం లేదు కానీ ఈ పదం దేవుడు మనకు "సహకారి"యైయున్నాడు అన్న పదమునకు సమానార్థ పదము; చూడు కీర్తన 30:10.) స్త్రీ నిర్మింపబడడం, దేవుడామెను పురుషునియొద్దకు తీసుకురావడం 19 నుండి 25 వచనములలో చూస్తాము. దేవుడు సృష్టించిన ప్రతి జీవరాశికి ఆదాము పేరుపెట్టినప్పుడు అతడు తప్పనిసరిగా ఒంటరితనమునకు లోనయియుంటాడు. ఎందుకంటే అప్పుడు తనవంటి వ్యక్తి మరొకరు సహాయం చేయడానికి లేరు కాబట్టి. దేవుడు స్త్రీని, ఆదామునొద్దకు తీసుకురాగా, అతడు ఆశ్చర్యానందముతో, "నా యెముకలలో ఒక యెముక, నా మాంసములో మాంసము ఇది నరునిలోనుండి తీయబడెను గనుక నారి అనబడును" (2:23) అని అన్నాడు. ఇప్పుడు అతనికి సాటియైన సహాయం దొరికింది తన జీవితమును పంచుకొనుటకు భాగస్వామిదొరికింది.

దేవుడు మన సృష్టికర్త కాబట్టి మనమాయన ఆజ్ఞలను లక్ష్యపెట్టకపోయినా మనలను ఆజ్ఞాపించే అధికారం, విమర్శించే అధికారం ఆయనకు ఉంది (అంటే మనలను బాధ్యతగల వారినిగా చేయడం). ఇది ఆదికాండము 2:15-17లో స్పష్టమవుతుంది:

> మరియు దేవుడైన యెహోవా నరుని తీసికొని ఏదెను తోటను సేద్యపరచుటకును దాని కాచుటకును దానిలో ఉంచెను. మరియు దేవుడైన యెహోవా – ఈ తోటలోనున్న ప్రతి వృక్ష ఫలములను నీవు నిరభ్యంతరముగా తినవచ్చును; అయితే మంచి చెడ్డల తెలివినిచ్చు

వృక్షఫలమును తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని నరుని కాజ్ఞాపించెను.

ఈ వాక్య భాగంలో ఆజ్ఞ మరియు బాధ్యత రెండింటిని చూస్తున్నాము. దేవుడు మనకు "సలహాలు" మాత్రమే యిచ్చువాడు కాడు. మన వ్యక్తిగత ఆనందము కోరే, ఆత్మ సంతృప్తికి నడిపించే "మనో వైద్యుడు" కాదు దేవుడు. ఆయన మనలను నిర్మించిన దేవుడు. ఆయన ఆజ్ఞలకు ప్రతిస్పందించి మనం ఆయనకు జవాబు చెప్పాలి.

అయితే, దురదృష్టవశాత్తు కేవలం మనమాయన స్వభావములో చేయబడిన ప్రత్యేక సృష్టిమాత్రమే కాదు గాని, ఆయనకు వ్యతిరేకంగా నోరెత్తగల ఏకైక జీవరాశులము కూడా మనమే. ఇదే ప్రపంచ సమస్య అయిన పాపమునకు దారితీసింది.

## పాపము

"నీవు తినకూడదు ... నీవు నిశ్చయముగా చచ్చెదవు" అన్న ఆజ్ఞ మరియు హెచ్చరిక ద్వారా దేవుడు పాపమును నిరోధించుటకు ప్రయత్నించాడు. సాధారణముగా దేవున్ని న్యాయవిమర్శ చేయువానిగా, ఖండించువానిగా మనం చిత్రీకరిస్తాము. కానీ దేవుడు న్యాయ విమర్శ చేయుటకు ముందు తప్పనిసరిగా ఆయన హెచ్చరిస్తాడని వాక్యములో కనబడుతుంది. ఇశ్రాయేలు తీర్పునకు గురికాకముందు అనేకమంది ప్రవక్తలు ఎన్నో సంవత్సరాలు హెచ్చరించారు. దుర్మార్గులు మరణము నొందుట వలన దేవుడు ఆనందించడు (యెహెజ్కేలు 33:11). కాబట్టి పాపము జరుగకుండునట్లు ఆయన చేయగలిగినదంత చేశాడు. నిజానికి తన లేఖనముల ద్వారా మనలను హెచ్చరించుట ఆయన ఆపలేదు.

దేవునియందు ఆయన వాక్యమునందు నమ్మకముంచకపోవడం పాపమునకు కారణమవుతుంది. హవ్వ సర్పము చేత శోధింపబడడం (సర్పము అనగా సాతాను; ప్రకటన 12:9). హవ్వ మోసపోవడం. తరువాత తనతో పాటు ఆదామును కూడా పాపములోనికి లాగడం వంటి దుఃఖకర సంఘటనలను ఆదికాండము 3:1-7 వాక్య భాగములో చూస్తున్నాము. మొదటిగా, అవిధేయత, మరణం గురించి దేవుడు వారితో చెప్పిన సత్యమును సాతానుడు త్రోసిపుచ్చాడు. "మీరు చావనే చావరు!" అని దేవుని సత్యమును వక్రీకరిస్తున్నాడు. తరువాత మంచి, చెడుల తెలివినిచ్చే అద్భుతమును వారు ఆనందించకుండా దేవుడు వారిని అడ్డుకుంటున్నాడని వారిని సాతానుడు ఏమార్చాడు. అంతేగాక, వారికి తెలివి వచ్చి తన వలెనే తెలివిగలవారై తనకు పోటీగా ఉంటారని దేవుడు భయపడుతున్నాడని వారికి చెప్పాడు.

దురదృష్టకర సంఘటనను 6వ వచనం తెలియజేస్తుంది. "స్త్రీ ఆ వృక్షము ఆహారమునకు మంచిదియు, కన్నులకు అందమైనదియు, వివేకమిచ్చు రమ్యమైనదియునై యుండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసికొని తిని తనతోపాటు తన భర్తకును ఇచ్చెను ..." తన సృష్టికర్తయందు అపనమ్మికయుంచి, శోధనకు మరలుకొల్పబడి తన దేవుడు విధించిన మొదటి నిబంధనను ఉల్లఘించింది హవ్వ! Paul R. House యిలా వ్రాస్తున్నాడు, "దేవునియందలి అపనమ్మకముతో పాపము మొదలవుతుంది, తనకు హాని చేసే దానితోపాటు మానవుడు దేవుని సత్యమును నిర్లక్ష్యపెట్టి ఆఖరకు నాశనమునకు జోగుతాడు."[1] మానవులు ఒక్కసారి దేవునియందు అపనమ్మకముంచి ఆయన మాటలు గాక శోధకుని మాటలు నమ్మినందుకు తన సృష్టికర్త ఎదుట అవిధేయులై అపరాధులయ్యారు.

కేవలం దేవునికి మానవునికి మధ్యనున్న సంబంధము మాత్రమే చెడిపోలేదు, ఆదికాండము 3:8-13 ప్రకారం స్త్రీ మరియు పురుషుల మధ్యనున్న సంబంధం కూడా చెడి పోయింది. దేవుని సన్నిధిలో ఆనందించాల్సిన ఆది దంపతులు దాగుకొనడం మొదలు పెట్టారు. వారికి సిగ్గు ఎలా తెలిసివచ్చిందని ఆదాము హవ్వలను దేవుడు ప్రశ్నించినప్పుడు ఆదాము నిందను తన భార్యపైనే నెట్టాడు. తద్వారా పరోక్షంగా దేవునిదే తప్పు అని మాట్లాడుతున్నాడు. "నాతో నుండుటకు నీవు నాకిచ్చిన ఈ స్త్రీయే ఆ వృక్షఫలములు కొన్ని నాకియ్యగా నేను తింటిని" (3:12) అని అన్నాడు. దురదృష్టవశాత్తు ఈనాటికి ఎంతోమంది ప్రజలు దేవునినుండి దాగుకొంటూ, ఒకరినొకరు నిందించుకుంటూ, దేవునితోను ఇతరులతోను సఖ్యతగా ఉండలేకపోతున్నారు. మంచి సంబంధములు ఎందుకు కనుమరుగైపోతున్నాయో 11 నుండి 16 వచనాలు తెలియజేస్తున్నాయి. సమాధానముండవలసిన చోట ఇప్పుడు అశాంతి నెలకొంది. మనం సుఖముగా జీవించడం కోసమే కష్టపడకుండా ఇతరులతో సఖ్యతగా జీవించుటకు కూడ కృషిచేయాలి. ఎంతోమంది దీనిని విస్మరిస్తున్నారు.

సర్పమునకు, మానవునికి స్త్రీకి భూమికి విధించబడిన శాపములను చూస్తే, దేవుడు పాపమునకు తగిన బాధ్యతాయుత ప్రవర్తనను కోరుతున్నాడని అర్థమవుతుంది. ఆయన పాపము విషయములో ఊరుకోడు. దేవునికి అవిధేయతను కనబరిస్తే విపరీత పరిణామాలు ఉంటాయని ఈ శాపముల వలన అర్థమవుతుంది. పాపము చేసినప్పుడు మనం క్షమించ బడినను అందుకు తగిన ప్రతిఫలం మాత్రం తప్పనిసరిగా అనుభవించి తీరాల్సిందేనని ఇందునుబట్టి స్పష్టమవుతుంది.

ఈ కథలోను ఒక శుభవార్త ఉన్నది. మనం పాపం చేసినను, దేవుడు మనలను విడిచి పెట్టలేదు. ఇది సృష్టి క్రమంలోనూ వెల్లడైంది. ఆదికాండము 3:15లో ఒక శుభ సూచన కనబడుతుంది. ఇది రాబోవు రక్షకుని గురించిన మొట్టమొదటి వాక్యభాగం. దీనిని ప్రోటో ఇవాంజెలియన్ అంటారు. ఈ వాగ్దానం ఇచ్చిన సమయంలో అస్పష్టమైన వాగ్దానంగా కనిపిస్తుంది. అయితే పరిశుద్ధ లేఖనం బయలుపరచబడే కొలది యిది స్పష్టమైనది. "అది నిన్ను తలమీద కొట్టును; నీవు దానిని మడిమె మీద కొట్టుదువు." క్రొత్త నిబంధన కోణంనుండి చూచినప్పుడు, ఈ వచనం క్రీస్తును సూచిస్తున్నదని చెప్పవచ్చు – ఆయన సాతాను తలను చితగకొట్టి అతడి కార్యములను లయపరచగలిగినవాడైనను, ఈ లోకంలో అశాశ్వతమైన తన ప్రాణమును మన కోసం తాత్కాలికంగా త్యజించాడు.

తన సృష్టి పాప పంకిలమైపోయినా ఇంకనూ దేవుని ప్రేమ దాని యెడల యుందని మన వాక్య భాగంలో చూస్తున్నాం. ఆదామునకును, అతని భార్యకును దేవుడు "చర్మపు చొక్కా కుట్టించాడని" ఆదికాండము 3:21లో మనం చూస్తున్నాము. ఒక సున్నిత సన్నివేశం ఇది. తమకు తాముగా కొని తెచ్చుకున్న నగ్నత్వము, సిగ్గు అవమానమును కప్పిపుచ్చడానికే సృష్టికర్త ప్రయత్నించాడే గాని దారి తప్పిన తన సంతానాన్ని నాశనం చేయడానికి గాని, వారికి వెన్ను చూపడానికి గాని ప్రయత్నించలేదు. ఇది రాబోవు శుభ పరిణామానికి సూచన. 22 నుండి 24 వచనాలను జాగ్రత్తగా పరిశీలిస్తే దేవుని ప్రేమ కార్యము కనబడుతుంది. ఆదాము, హవ్వలను దేవుడు తోటనుండి వెళ్ళగొట్టి, వారు తిరిగి జీవ వృక్ష ఫలములను తినకుండునట్లు ఆయన కాపుదల చేశాడు. దేవునితో సమానంగా జీవించకుండా వారు పాపము చేశారు. తిరుగుబాటు చేసిన పాపులుగా వారు శాశ్వతంగా జీవించలేరు. ఒకవేళ

పాపం చేసిన ప్రతివారు ఈ నాటికి జీవించియున్నట్లయితే ఈ లోకం ఏ విధంగా ఉండేదో! అందుకే దేవుడు అలా జరుగనివ్వలేదు. అయితే అది అంతటితో ముగిసిపోదు. జీవ వృక్షము ఈ నాటికీ నిలిచి ఉంది. దానికి మార్గము "సురక్షితముగా కాపుకాయబడి" ఉంది. ఇందులో ప్రవేశానికి ఇంకనూ అవకాశముంది (చూడు ప్రకటన 22:1–5), ఈ విషాదకర ఘటన యేసుక్రీస్తుని ఆగమనముతో సంతోషభరితమైంది. సృష్టికర్త స్వాధీనంలోకి మనం తేబడ్డాము. అంతిమంగా పాపము గెలవదు. ఇప్పటికీ ఇది దేవుని లోకమే. మనము ఆయన సృష్టే! ఆయన మనలను విడువడు, ఎడబాయడు.

### ముగింపు

పాపమునకు తగిన పరిష్కారము గురించే మిగతా లేఖన భాగములు తెలియజేస్తున్నాయి. ఆ పరిష్కారము గురించి చూసేముందు, సమస్యను మరింత స్పష్టంగా చేసే సూత్రములు గురించి మనం అర్థంచేసుకోవాలి. ప్రేమమయుడైన దేవుడు తన సృజనాత్మకతో ఆయనకు, ఆయన వాక్యమునకు లోబడియుంటామని, నమ్మకస్థులమై యుంటామని మనలను సృష్టించాడు. అయితే, మనం పాపం చేశాము. ఇందుకు ప్రతిఫలముగా మరణము వచ్చింది. ఆదికాండము 1–3 వాక్యభాగమును చదువుట ముగించేసరికి రక్షకుని అవసరత ఎరిగి ఉండాలి.

---

సూచన

[1]Paul R. House, *Old Testament Theology* (Downer's Grove, Ill.: InterVarsity Press, 1998), 64-65.

---

## "మన స్వరూపములో"?

ఆదికాండము 1:26లోనున్న బహువచన సర్వనామ పద ప్రయోగం గురించి ఎన్నో చర్చలు జరిగాయి ("మన" మరియు "మనము"). వాటి అర్థం ఏమిటి? దేవుడు ఒక్కడే. అప్పటికింకా సృష్టి జరుగలేదు కాబట్టి. ఆయన ఎవరితో ఈ మాటలు చెప్పినట్లు? మానవులకంటే ముందే సృష్టింపబడిన దేవదూతలతో ఆయన ఈ మాటలు చెప్పినట్లు కొంతమంది భావిస్తారు. ఇది సబబే అయి ఉండవచ్చు కాని పరిశుద్ధ గ్రంథం ఇలాగు చెప్పడం లేదు.

అయితే, మరి కొంత మంది ఈ పదమును "రాజరిక వైభవ చిహ్నపు బహు వచనముగా" పేర్కొంటున్నారు. ఇందులో తన గురించి మాట్లాడే వ్యక్తి తనను తాను గౌరవించుకొను నిమిత్తము తాను ఒక్కడే అయినా, బహు వచనం (మనము) ఉపయోగించి మాట్లాడినాడు అని అంటారు. అయితే, దైవత్వం – తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అనే ముగ్గురు వ్యక్తిత్వాల్లో ప్రతిబింబించిందన్న వాస్తవము అనేకమంది క్రైస్తవుల్లో ప్రఖ్యాతిగాంచిన వివరణ. వారి మధ్య చోటుచేసుకున్న సంభాషణ లేదా మాటలుగా ఈ సర్వనామ పదాలు సూచిస్తున్నాయి. (సృష్టి గాథలో పరిశుద్ధాత్ముని పాత్రను ఆదికాండము 1:2లో చూడండి. అలాగే సృష్టి గాథలో క్రీస్తు యేసుని పాత్రను యోహాను 1:3, 10 మరియు హెబ్రీయులకు 1:2లో చూడు.) తరువాత క్రొత్త నిబంధన బలపరుస్తున్న దైవత్వం యొక్క త్రిముఖ స్వభావముతో యిది సమయోచితంగా ఉంది.